
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.3 ; కనిష్ఠం 24.0

ఆంధ్రజ్యోతి

నిజామాబాద్
జిల్లా వార్తలు

5

శనివారం 5 ఏప్రిల్ 2025



సీపీ సాయిచైతన్యను కలిసిన ఆర్టీసీ ఆర్ఎం

ఖిల్లా, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సాయిచైతన్యను ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జోస్నా మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం సీపీ చాంబర్‌లో పూలమొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని పరిస్థితులపై కొద్ది సేపు చర్చించారు.



సీపీకి పూలమొక్కను అందజేస్తున్న ఆర్ఎం జోస్నా



విలేకరుల సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న పోలీసు కమిషనర్ సాయిచైతన్య

ఆన్‌లైన్ బెట్టింగ్ ముఠా గుట్టు రట్టు

- ఫేక్ యాప్ ద్వారా.. జనాన్ని మోసగిస్తున్న నిందితులు
- వివరాలు వెల్లడించిన సీపీ సాయి చైతన్య

ఖిల్లా, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఫేక్ యాప్‌ల ద్వారా కొనసాగుతున్న ఆన్‌లైన్ బెట్టింగ్ దందాకు జిల్లా పోలీసులు చెక్ పెట్టారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనలో కొందరు యువకులు బెట్టింగ్ ముఠాగా ఏర్పడి అమాయక ప్రజలను నిండా ముంచుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆ ముఠాను అరెస్టు చేశారు. శుక్రవారం పోలీసు కమిషనర్ సాయిచైతన్య కమాండ్ కంట్రోల్ రూం సమావేశపు హాల్‌లో విలేకరులకు వివరాలను వెల్లడించారు. నగరంలోని భారతీరాణి కాలనీకి చెందిన షేక్ ముజీబ్ ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు నార్త్ రూరల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఐదో టౌన్ ఎస్సై గంగాధర్, సిబ్బందితో ఈ నెల 3వ తేదీన పోలీసులు అతని ఇంటిపై దాడులు చేశారు. ఈ దాడిలో ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఈ దాడిలో ముజీబ్‌తో పాటు ఈ యాప్‌లో ఏజెంట్లుగా ఉన్న షేక్ నదీం, షేక్ జునైద్, షేక్ రహాన్‌లను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వీరితో పాటు మరో నలుగురు సాలూర మండలానికి చెందిన షకీల్, ఆటోనగర్‌కు చెందిన షేక్ నజీబ్, మహారాష్ట్ర ధర్మాబాద్‌కు చెందిన సచిన్, నిజామాబాద్‌కు చెందిన రమేష్‌లు తప్పించుకున్నట్లు ఆయన తెలిపారు. ఫేక్ యాప్ ద్వారా బెట్టింగ్ మోసాలు చేయడానికి మాస్టర్‌మైండ్‌గా ఉన్న సచిన్ కింద ఏజెంట్లుగా కొనసాగుతున్నారన్నారు. ఇలా సుమారు వేయి మందికి పైగా ఈ వీరి ఉచ్చులో పడి సర్వం పోగొట్టుకున్న వారు ఉన్నారన్నారు. రెండేళ్లలో ఈ ముఠా సభ్యులు సుమారు 88లక్షల వ్యాపార లావాదేవీలు జరిపినట్లు విచారణలో తేలిందన్నారు. వీరిపై కేసులు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.50 వేల నగదు, 5 సెల్‌ఫోన్లు, బ్యాంకు పాస్ బుక్కులు, డెబిట్, క్రెడిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అలాగే ఆర్మూర్ పోలీసు స్టేషన్ పరిధిలో సైతం బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు ఆర్మూర్ ఏసీపీ జె.వెంకటేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు సత్యనారాయణ, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఆంజయ్య, ఎస్సై ఎస్.మహేష్ సిబ్బందితో ఆర్మూర్ పట్టణంలోని ఎంజే ఆస్పత్రి సమీపంలో నివాసం ఉండే వడ్డీ వ్యాపారస్తుడు గట్టడి వడ్డ గౌతం, టీచర్స్ కాలనీకి చెందిన దయాల్ సునీల్, జాజు రంజిత్‌ల నివాసాలపై దాడులు చేశారన్నారు. వీరిని విచారించగా హర్యాన రాష్ట్రానికి చెందిన విపుల్ మంగ్, బోరి గ్రామానికి చెందిన బంటు పలాస్, యవాత్మల్‌కు చెందిన బబ్లూ ఠాకూర్, వినాయక్ ఠాకూర్‌లు కలిసి ముఠాగా ఏర్పడ్డారన్నారు. వీరు నిషేధిత బెట్టింగ్ యాప్ ద్వారా ప్రజలను మోసం చేసి వచ్చిన డబ్బును అధిక వడ్డీకి ఇవ్వడంతో పాటు ద్విచక్ర వాహనాలు తాకట్టు పెట్టుకునే వారని తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 6వేల నగదు, 3సెల్‌ఫోన్లు, తాకట్టుపెట్టుకున్న 34 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మిగతా గట్టడి శ్రీకాంత్ అలియాస్ శ్రీకర్, విపుల్‌మంగ్, బంటుపలాస్, బబ్లూఠాకూర్, వినాయక్ ఠాకూర్‌లు పరారీలో ఉన్నట్లు వివరించారు. వీరిని సైతం త్వరలోనే అరెస్టు చేస్తామని సీపీ తెలిపారు. క్రికెట్ బెట్టింగ్ ద్వారా యువకులను మోసాల బారిన పడేస్తున్న ముఠా గుట్టును రట్టు చేసిన ఆర్మూర్, నార్త్‌రూరల్ పోలీసులను ఈ సందర్భంగా సీపీ అభినందించారు.



ఆర్అండ్‌బీలో ఇన్‌చార్జిల పాలన!

- కీలక పోస్టులన్నీ ఖాళీ
- ఎస్ఈ, ఈఈ, డీఈలు ఇన్‌చార్జిలే
- అదనపు బాధ్యతలతో ఇక్కట్లు పడుతున్న అధికారులు

నిజామాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లా ఆర్అండ్‌బీ శాఖలో కీలక పోస్టులన్నీ ఖాళీగానే ఉన్నాయి. కొందరు పదవీ విరమణ పొందగా మరి కొందరిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడంతో కీలక పోస్టులన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఎస్ఈ, ఈఈ పోస్టుల్లో ఇన్‌చార్జిలే కొనసాగుతు న్నారు. డీఈలు కూడా ఒక పోస్టులో పూర్తిస్థాయిలో ఉంటూ మరో పోస్టులో ఇన్‌చార్జిలుగా కొనసాగుతున్నారు. పదోన్నతులు ఆలస్యం కావడంతోపాటు కీలక అధికారులు పదవీ విరమణ పొందడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. వీటితో పాటు కొన్ని మండలాల పరిధిలో ఏఈల పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయి.

జిల్లా ఇన్‌చార్జిగా సంగారెడ్డి ఎస్ఈ

జిల్లాలో రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో కీలకమైన రోడ్లను పర్యవేక్షిస్తారు. జిల్లా, రాష్ట్రస్థాయి రోడ్ల పర్యవేక్షణతో పాటు కీలకమైన రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. ప్రధాన రోడ్ల నిర్మాణంతో పాటు కల్వర్టులు, రోడ్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణాలు చేస్తున్నారు. ఇలాంటి కీలకమైన శాఖలో ఎస్ఈ లేరు. సంగారెడ్డికి చెందిన ఎస్ఈ వసంత్ నాయక్ ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఆయన అక్కడ కొన్ని రోజులు పనిచేస్తూ ఇన్‌చార్జిగా ఇక్కడ ఉండటంతో వారంలో ఒకటి రెండు రోజులు కేటాయిస్తున్నారు. కీలకమైన సమావేశాలు ఉన్న సమయంలో ఇక్కడికి వస్తున్నారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఆయన ఎస్ఈగా ఉండటం వల్ల కీలకమైన ప్రాజెక్టులను పర్యవేక్షించాల్సి ఉంది. ఉమ్మడి జిల్లాకు కలిపి సూపరింటెండెంట్ ఇంజనీర్ ఒకే పోస్టు ఉంది. ఈ రెండు జిల్లాల పరిధిలో ఇన్‌చార్జి ఉండటం భారీ ఎత్తున రోడ్ల నిర్మాణం చేపట్ట డం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయి. కీలకమైన నిజామా బాద్ ఈఈగా పనిచేసిన సురేష్ పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో కొత్త వారిని నియమించలేదు. డీఈ విక్రమ్‌కు ఇన్‌చార్జిగా ఈఈ పదవిని కట్టబెట్టారు. ఆయన రెగ్యులర్ డీఈ కార్యక్రమాలతో పాటు ఈఈకి సంబంధించిన కార్యక్రమాలు కూడా పర్యవేక్షిస్తున్నారు. కొత్త రోడ్లకు ప్రతిపాదనలు పంపించడంతో పాటు హైబ్రీడ్ యాన్యునిటీ మోడ్ కింద కొత్త రోడ్ల ప్రతిపాదనలు తయారు చేస్తున్నారు. పూర్తిస్థాయిలో ఈఈ లేకపోవడం వల్ల ఇన్‌చార్జిగా ఆయన ఈ రోడ్లను పర్యవేక్షిస్తున్నారు. ఇవే కాకుండా కొన్ని రోడ్ల మరమ్మతులను కూడా చేపడుతున్నారు. జిల్లాలో పలు డివిజన్‌లలో డీఈ పోస్టుల ఖాళీలు కూడా ఉన్నాయి. నిజామాబాద్ పరిధిలో టెక్నికల్ డీఈ మరో డివిజన్‌కు ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. బోధన్, ఆర్మూర్‌తో పాటు ఇతర డివిజన్‌లో కీలకమైన పనులు కొనసాగుతున్న వేళ ఖాళీలు ఉండటం శాఖ అధికారులను ఇబ్బందులకు గురి చేస్తుంది. ఒకరికి రెండు లేదా మూడు బాధ్యతలను అప్పచెప్పడం వల్ల సమస్యలను ఎదుర్కొంటున్నారు. కొన్ని మండలాల పరిధిలో ఏఈలు 8 వరకు ఖాళీగా ఉన్నాయి. ఇవే కాకుండా ఇతర పోస్టులు కూడా ఖాళీలు ఉండటంతో ప్రతిపాదనలతో పాటు ఇతర పనులకు సమస్యలను ఎదుర్కొంటున్నారు. రాష్ట్రస్థాయిలో పదోన్నతులు ఇచ్చిన తర్వాత కీలకమైన పోస్టులన్నీ భర్తీ చేసే అవకాశం ఉందని ఆర్అండ్‌బీకి చెందిన అధికారులు తెలిపారు. త్వరలోనే ఎస్ఈతో పాటు ఈఈ, డీఈ పోస్టుల భర్తీ అయ్యే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు.



వైద్య కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

- పట్టాలను అందుకున్న 2019 బ్యాచ్‌కు చెందిన 119 మంది వైద్య విద్యార్థులు
- పట్టాలను ప్రదానం చేసిన గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర

7


కేంద్ర అర్బన్ హౌజింగ్ సెక్రెటరీని కలిసిన ఎంపీ అర్వింద్

- అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలని వినతి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పట్టణ అభివృద్ధి, హౌజింగ్ శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్‌ను ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, డాక్టర్ సంజయ్‌కుమార్‌లు శుక్రవారం ఢిల్లీలో కలిశారు. పార్లమెంట్ పరిధిలోని హౌజింగ్ స్కీమ్‌కు సంబంధించిన అంశాలపై చర్చించారు. పార్లమెంట్ పరిధిలోని మున్సిపాలిటీల అభివృద్ధి పనులకు సంబంధించి నిధులు విడుదల చేయాలని వారు కోరారు. కార్యదర్శిని కలిసిన వారిలో బీజేపీ నేతలు మోరపల్లి సత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ జ్యోతితో పాటు ఇతర నేతలు ఉన్నారు.



అర్బన్ హౌజింగ్ సెక్రెటరీతో ఎంపీ అర్వింద్



పన్ను ఎగవేతదారులపై ఐటీ నజర్

- రెండేళ్లుగా తక్కువగా చెల్లించిన వారిని గుర్తించే పనిలో అధికారులు
- అధిక ఆదాయం పొందే వారే టార్గెట్
- పన్నులు ఎగవేసేందుకు భూముల కొనుగోళ్లు చేస్తున్న జిల్లాకు చెందిన పలువురు

ఖిల్లా, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఆదాయపు పన్ను ఎగవేతదారులపై ఆ శాఖ అధికారులు నజర్ పెట్టారు. రెండేళ్లుగా ఎక్కువ ఆదాయం పొందుతూ తక్కువగా చెల్లింపులు చేసే వారిని గుర్తించే పనిలో పడ్డారు. మార్చి 31తో వార్షిక ఏడాది గడువు ముగియడంతో ఆదాయం పన్ను చెల్లింపులు చేయని వారి వివరాలను సేకరిస్తున్నారు. వీరిలో ప్రతి రోజూ వేలల్లో సంపాదించే బడా వ్యాపారుల వివరాలను సేకరిస్తున్నట్లు సమాచారం. గత రెండు ఆర్థిక సంవత్సరాల్లో పన్ను మినహాయింపుల్లో అవకతవకలకు పాల్పడినట్లుగా అనుమానిస్తున్న వారిపై ఆ శాఖ ప్రత్యేక నిఘా పెట్టినట్లు తెలిసింది. టీడీఎస్ చెల్లింపులో జరిగిన అవకతవకలను గుర్తించేందుకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు సమగ్రమైన వ్యూహాన్ని రూపొందించి జిల్లా అధికారులకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు సమాచారం.

బడా వ్యాపారులపై దృష్టి

బడా వ్యాపారులు, బడా పారిశ్రామిక వేత్తలు, రైస్‌మిల్లర్స్‌పై అధికారులు దృష్టి సారించినట్లు సమాచారం. జిల్లాలో ఉన్న వైద్యులు ప్రతి రోజూ ఎంత సంపాదిస్తున్నారు, వారు ఎంతమేరకు ఆదాయపు పన్ను చెల్లిస్తున్నారు అనే కోణంలో ఆరాతీస్తున్నట్లు తెలిసింది. అదే విధంగా జిల్లాలో గతంలో ప్రతి సంవత్సరం ఆదాయపు పన్ను చెల్లించే వ్యాపారుల వివరాలను సేకరిస్తూ ప్రస్తుతం వారు ఎంతమేరకు చెల్లింపులు చేస్తున్నారని గుర్తించే పనిలో పడ్డారు.

పన్నులు ఎగవేతకు భూముల కొనుగోళ్లు

ఆదాయపు పన్నుల చెల్లింపు పరిధిలోకి వచ్చే జిల్లాకు చెందిన కొందరు వ్యాపారులు, వైద్యులు, బడా పారిశ్రామిక వేత్తలు పన్నులు ఎగవేసేందుకు గాను కొత్త ఎత్తుగడ వేస్తున్నారు. వారు సంపాదించింది తక్కువ చూపడానికి భూములు కొనుగోళ్లు చేస్తున్నారు. ఇలా చేసి వ్యవసాయాధారిత ఉత్పత్తులను చూపి పన్నులు ఎగవేస్తున్నట్లు ఆదాయపు శాఖాధికారుల దృష్టికి వచ్చినట్లు సమాచారం. ఆ దిశగా ఎవరెవరు ఎక్కడెక్కడ భూములు కొనుగోళ్లు చేపట్టారు, అందులో నుంచి ఎంత ఆదాయం వస్తుంది అనే వివరాలను సేకరిస్తున్నట్లు తెలిసింది.

నిలిచిన సర్వేలు

గతంలో ఆన్‌లైన్ విధానం అమలులో లేని సమయంలో ఎక్కువ ఆదాయం పొంది తక్కువ ఆదాయపు పన్ను చెల్లించే వారిని గుర్తించి వారి సంస్థలపై దాడులు (సర్వేలు) చేసే వారు. మార్చి పూర్తి కాగానే తక్కువ ఆదాయపు పన్ను చెల్లించిన వారిని గుర్తించి ఎగవేసిన చెల్లింపులను రాబట్టుకునే వారు. కానీ ఆన్‌లైన్ విధానం అమలులో ఉండడం వల్ల ఆ శాఖ సర్వేలకు స్వస్తి పలికింది. ఆదాయపు పన్నుల పరిధిలోకి వచ్చే వారికి ప్రత్యేకంగా ఒక నెంబర్‌ను కేటాయించి యేటా ఎంత మేరకు పన్ను వస్తుంది అని పరిశీలిస్తున్నారు.

బిల్లుల పేరుతో పన్ను ఎగవేత

అవినీతికి పాల్పడే ప్రభుత్వ శాఖలపై దృష్టి సారించకపోవడంతో ఉద్యోగులు ఫేక్ బిల్లులు తిరిగి వసూళ్లు చేసుకుంటున్నారు. ఇలా చేయడం వల్ల ఆ శాఖాకు భారీ ఎతున ఆదాయానికి గండి పడుతోంది. ఆదాయపు పన్ను చెల్లింపు పరిధిలోకి వచ్చే ఉద్యోగులు యేటా ఆదాయపు పన్ను చెల్లించిన తర్వాత రిటర్న్ పొందడానికి వివిధ రకాల బిల్లులు పెట్టి మినహాయింపు పొందుతున్నారు. ముఖ్యంగా వైద్యానికి చెందిన బిల్లులను పరీక్షలు చేయించుకున్నా, చేయించుకోకపోయినా బిల్లులు పెట్టి ఆదాయపు పన్నుల శాఖ ద్వారా ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారు. అలాంటి ఫేక్ బిల్లులను గుర్తించి వారి వద్ద నుంచి పన్నులు వసూలు చేయడానికి ఆ శాఖ సిద్ధమైంది.

బియ్యం పంపిణీని పకడ్బందీగా పర్యవేక్షించాలి

- అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సన్నబియ్యం పంపిణీ పథకాన్ని పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి మంత్రి జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ ద్వారా సన్నబియ్యం పంపిణీపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు చెందిన వారు కూడా నాణ్యమైన సన్నబియ్యంతో కూడిన భోజనం చేయాలనే బృహత్తర సంకల్పంతో ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా ఉచితంగా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. సుమారు 13వేల కోట్ల రూపాయల భారం పడుతున్నప్పటికీ పేద కుటుంబాలకు ఈ పథకం వర్తింపజేస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా ఆహార భద్రతను ఆచరణాత్మక రూపంలో కల్పించినట్లు అయ్యిందని రాష్ట్రంలో సుమారు 80 నుంచి 84 శాతం మంది నిరుపేదలకు ఉచితంగా సన్నబియ్యం అందుతుందన్నారు. ఇదివరకు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలిపి 40 రూపాయలకు పైగా కిలో బియ్యానికి వెచ్చించి ప్రజలకు ఉచితంగా బియ్యం సరఫరా చేశామని 70 నుంచి 80 శాతం వరకు ఆ బియ్యాన్ని ప్రజలు తినే వారు కాదని రీసైక్లింగ్ ద్వారా కోళ్ల ఫారాలకు ఇతర అవసరాల కు ఆ బియ్యం తరలివెళ్లేదని ప్రస్తుతం సన్నబియ్యం పంపిణీ విజయవంతం అవుతుందని ప్రజలు సంతోషంతో స్వీకరిస్తున్నారని అన్నారు. కాగా రేషన్ దుకాణాలకు బియ్యం నిల్వలు సకాలంలో చేరుకునేలా ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలని రవాణా పరమైన ఇబ్బందులు తలెత్తకుండా సమన్వయంతో చర్యలు చేపట్టాలన్నారు. ప్రతీ రేషన్ డీలర్ వద్ద ఆహార భద్రత కార్డులోని సభ్యుల సంఖ్యకు అనుగుణంగా పూర్తిస్థాయిలో



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, ఇతర అధికారులు



వీసీలో మాట్లాడుతున్న మంత్రి, సీఎస్

మిగతా 8వ పేజీలో...

ఏర్గట్లలో ఉద్రిక్తత

- తెల్లవారుజామున శివాజీ విగ్రహ ప్రతిష్ఠాపన
- అనుమతి లేదని అడ్డుకున్న పోలీసులు
- రాజకీయాలకు అతీతంగా మండల వాసుల ఆందోళన



నూతన శివాజీ విగ్రహం వద్ద ఏర్గట్ల వాసుల ఆందోళన



గ్రామస్థులకు సర్దిచెప్పే ప్రయత్నం చేస్తున్న పోలీసులు

ఏర్గట్ల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన ఏర్పాటు వ్యవహారం శుక్రవారం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. విగ్రహ ఏర్పాటుకు అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకోవడంతో.. ఈ విషయంలో తగ్గేది లేదంటూ రాజకీయాలకు అతీతంగా గ్రామస్థులు ఆందోళన బాట పట్టారు. వివరాల్లోకి వెళితే.. ఏర్గట్ల గ్రామ బస్టాండ్ వద్ద శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విషయమై సమాచారం అందడంతో.. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు విగ్రహ ఏర్పాటుకు అనుమతులు లేవని అభ్యంతరం తెలిపారు. అదే సమయంలో విగ్రహం ఏర్పాటు చేయకుండా గద్దె నిర్మాణాన్ని అడ్డుకున్నారు. దీంతో సమాచారం అందుకున్న మండలంలోని ప్రజా ప్రజాప్రతినిధులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, యువజన సంఘాలు రాజకీయ పార్టీలకు అతీతంగా ఏర్గట్లకు చేరుకొని ఆందోళన చేప ట్టారు. డివిజన్ పరిధిలోని పోలీస్ స్టేషన్‌ల ఎస్సైలతో పాటు జిల్లా ఏఆర్ సిబ్బంది సైతం చేరుకొని సర్దిచెప్పే ప్రయత్నం చేసినా.. ఏర్గట్ల వాసులు వినలేదు. దీంతో స్థానికంగా తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. విషయం తెలుసుకున్న ఆర్మూర్ ఏసీపీ వెంకట్ రెడ్డితో పాటు భీమ్‌గల్ సీఐ సత్యనారాయణ సైతం ఘటనా స్థలి వద్దకు వచ్చి స్థానికులకు ఆందోళన విరమించాలని కోరినా.. ప్రయోజనం లేకుండా పోయింది. విగ్రహ ఏర్పాటు ఎట్టి పరిస్థితుల్లో అనుమతులు ఇవ్వాల్సిందేనని యువజన సంఘాల సభ్యులు తేల్చిచెప్పారు. కాగా.. ఈ విషయమై భీమ్‌గల్ సీఐ సత్యనారాయణను వివరణ కోరగా.. శివాజీ విగ్రహ ఏర్పాటుకు ఎలాంటి అనుమతి లేదన్నారు. అనుమతి తీసుకోవాలని స్థానిక ప్రజలకు తెలపడం జరిగిందన్నారు. అంతవరకు విగ్రహానికి తెల్ల బట్టతో ముసుగు కప్పించామన్నారు. మరోవైపు.. ముందు జాగ్రత్త చర్యగా ఏర్గట్లలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

కల్లెడలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సన్మానిస్తున్న పూర్వవిద్యార్థులు

మాక్లూర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : ఆలూర్ మండలంలోని కల్లెడ గ్రామంలో జిల్లాపరిషత్ ఉన్న పాఠశాలలో శుక్ర వారం పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా జరుపుకున్నారు. 2000-2001లో పదోతరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు 25 సంవత్సరాల అనంతరం పాతజ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఉల్లాసభరితంగా గడిపారు.

మప్కాల్:బాల్కొండ మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు శుక్రవారం పూర్వవిద్యార్థుల సమ్మేళం జరుపుకున్నారు. 1982 సంవత్సరానికి చెందిన బ్యాచ్ 42 సంవత్సరాల తర్వాత ఒకేచోట కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు.

మోదీ, అమిత్‌షా చిత్రపటాలకు క్షీరాభిషేకం

ఎడపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఉభయ సభలలో వక్ఫ్ బోర్డు బిల్లు ఆమోదం పొందడంతో శుక్రవారం మండల కేంద్రలోని శివాజీ విగ్రహం వద్ద ప్రధానీ నరేంద్ర మోడీ, అమిత్ షా ఇతర నాయకుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు కోల ఇంద్రకరణ్ మాట్లాడుతూ బీజేపీ ముస్లిం వ్యతిరేక పార్టీ కాదని ఆయన అన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్‌సభ్యులు కందగట్ల రాంచందర్, జిల్లా కార్యవర్గ సభ్యులున్నారు.

బార్ అసోసియేషన్‌కు నామినేషన్ల దాఖలు

ఆర్మూర్‌టౌన్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో మొదటిరోజు అధ్యక్ష, ఉపాధ్యక్ష, జనరల్ సెక్రటరీ పదవికి నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు చర్యాల జగన్, కొత్తపల్లి రాములు తెలిపారు. శుక్రవారం అధ్యక్ష పదవికి జక్కుల శ్రీదర్, టికే. కొనేరు, విజయలక్ష్మీ, ఉపాధ్యక్ష పదవికి గట్టడి ఆనంద్, ప్రవీణ్‌చందర్, జనరల్ సెక్రటరి పదవికి గుంజాల సుదర్శన్‌లు నామినేషన్‌లు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

బాధిత మహిళా కుటుంబానికి ఆర్థిక సహాయం

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని చేంగల్ గ్రామంలోని జీవనజ్యోతి మహిళా సంఘంలో సభ్యురాలైన తలారి శారద అనే మహిళ అనారోగ్యంతో ఇటీవల మరణించింది. దీంతో ఆ కుటుంబానికి గ్రామ మహిళాసంఘాల సభ్యులు అండగా నిలిచారు. శుక్రవారం బాధిత కుటుంబానికి లక్ష్మీ గ్రామ మహిళా సంఘం సభ్యులు జమ చేసిన రూ.5000 ఆర్థిక సహాయాన్ని, నిత్యవసర సరుకులను ఐకేపీ సీనియర్ సీసీ గడాల రఘుపతి మృతురాలి కూతురు రోషియాకు అందజేశారు. కార్యక్రమంలో మహిళా సంఘం అధ్యక్షురాలు సంగెం స్రవంతి, వివోలు లక్ష్మీ, రూప, పల్లికొండ లక్ష్మీ పాల్గొన్నారు.

డ్రైనేజీలు శుభ్రం చేయించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మెండోర గ్రామంలో మురుగు కాలువలు, చెత్తాచెదారంతో నిండిపోయింది. శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో గ్రామంలో కంపుకొడుతున్న డ్రైనేజీలు అనే ప్రచురితమైనది. ఈ వార్తకు గ్రామ పంచాయితీ అధికారులు స్పందించి మురుగు కాలువల్లో నిండిపోయిన చెత్తా చెదారాలను తొలగించారు. దోమల నివారణకు బ్లీచింగ్ పౌడర్‌చల్లారు.

లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లి గ్రామంలో శుక్రవారం మండల కాంగ్రెస్ నాయకులు వివిధ పథకాలకు సంబంధించిన చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ నాయకులు చిప్ప మోహన్ మాట్లాడుతూ మండలంలోని ప్రజా సంక్షేమం కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు మల్ల ప్ప పటేల్, గంగాగౌడ్, మోహీద్దీన్, ఇస్మాయిల్, యూసుఫ్, పాండు నాయక్, బార్యానాయక్, చాంద్‌పాష, శంకర్, మొగులయ్య, రియాజ్, రాంచందర్, సుధాకర్ పాల్గొన్నారు.

'ప్రజారోగ్య సంరక్షణపై అవగాహన కల్పించండి'

పెద్ద కొడప్‌గల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో మండల ప్రజలు వేసవి కాలం దృష్ట్యా అనారోగ్యానికి గురికాకుండ సంరక్షణ చర్యలు తీసుకోవాలని మండల హెల్త్ సూపర్‌వైజర్ ప్రిసిల్లా ఆశ కార్యకర్తలకు సూచించారు. శుక్రవారం ప్రాథమిక ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన ఆశ కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు మహానంద, కల్పన, భారతి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నతక్కడ్‌పల్లి గ్రామంలో లబ్ధిదారులు నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి సూచించారు. మండలంలోని తక్కడ్‌పల్లి గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం మండలంలో తక్కడ్‌పల్లి గ్రామాన్ని పైలెట్ గ్రామంగా ఎంపిక చేసి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందన్నారు. ఈ పథకం కింద ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇండ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు.

రామారెడ్డి ఐకేపీ రికార్డులను తనిఖీ చేసిన అధికారి

రామారెడ్డి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డి జిల్లా కేంద్రానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న రామారెడ్డి మండల కేంద్రంలోని ఐకేపీ ఏపీఎం కార్యాలయంలో శుక్రవారం అంతర్గత సెర్ప్ సీబీఓ ఆడిటర్ జనార్దన్ ఆకస్మిక తనిఖీ చేశారు. మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం ప్రసన్న కుమార్, అధ్యక్షురాలు సుజాత, అకౌంటెంట్ అనిలా పాల్గొన్నారు.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు తగదు

రామారెడ్డి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రిపై కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలని శుక్రవారం రామారెడ్డి జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిని పట్టుకొని పాలేరు అనడం దొరహంకారానికి నిదర్శనమని అన్నారు. ప్రభుత్వానికి మంచి సలహాలు ఇస్తూ, తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. మీరు ఇలా గానే మాట్లాడితే రేవంతన్న సైన్యం మీకు సరైన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు.

ఆలయంలో గజస్తంభం ప్రతిష్ఠాపన

రామారెడ్డి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం గజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా శ్రీ సీతారామచంద్ర స్వామి శ్రీ పార్వతి రాజేశ్వరి స్వామి ఆలయాల ఉత్సవాల ప్రతినిధులు మాట్లాడారు. త్వరలో భక్తిశ్రద్ధలతో శ్రీ సీతారామచంద్రస్వామి శ్రీ పార్వతి రాజేష్ స్వామి వాళ్ళ ఉత్సవాలను వైభవంగా నిర్వహించడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు శంకర్ గౌడ్, రవీందర్ గౌడ్, మహిపాల్, బండి ప్రవీణ్, అంజయ్య, నర్సా గౌడ్, నరసింహులు, వడ్ల స్వామి, వల్లి నారాయణ, యువకులు పాల్గొన్నారు

ఫోరంను రైతులు, వినియోగదారులు వినియోగించుకోవాలి

● సీజీఆర్‌ఎఫ్‌టీజీ ఎన్‌పీడీసీఎల్ చైర్మన్



మాట్లాడుతున్న చైర్మన్

కమ్మర్‌పల్లి, ఏప్రిల్ 4: (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులు తమకెదురవుతున్న విద్యుత్‌సమస్యలను వినియోగదారుల ఫోరం ద్వారా పరిష్కరించుకోవచ్చని చైర్మన్ సీజీఆర్‌ఎఫ్ టీజీ ఎన్‌పీడీసీఎల్ ఎరుకల నారాయణ అన్నారు. శుక్రవారం కమ్మర్‌పల్లి మండల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆపరేషన్ డివిజన్ మోర్తాడ్ పరిధి గ్రామాల సబ్‌స్టేషన్లు ఏర్గట్ల, కమ్మర్‌పల్లి మోర్తాడ్, బషీరాబాద్ విద్యుత్ వినియోగ దారులఫిర్యాదులు పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్-11) నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. విద్యుత్ వినియోగదారులు ఎదుర్కుంటున్న సమస్యలను నేరుగా గాని వారి కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాప్‌లలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఫిర్యాదులు చేసి పరిష్కారం పొందాలని సూచించారు. 8 జిల్లాలల్లో ప్రతీ నెల పరిష్కారవేదికలు ఏర్పాటు చేసి రైతులు, గృహవినియోగదారులు ఎదుర్కుటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారిస్తున్నామని తెలిపారు. సమావేశంలో డీఈ ఆర్మూర్ రాజేశ్వర్, ఏడీఈ మోర్తాడ్ బీ.వినోద్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్ ఏఈలు అన్నయ్య, అల్లాపూర్ రమేష్, సబ్‌ఇంజనీర్‌లు హమీద్, గంగాధర్, ఎస్ఎల్ నాగభూషణం పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పుల సంఖ్య పెంచాలి

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేశ్వరి



ప్రభుత్వ ఆసుపత్రిలో మాట్లాడుతున్న జిల్లా వైద్య అధికారిణి

బోధన్‌రూరల్,ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ కాన్పులు పెంచాలని, మతా, శిశు మరణాలను తగ్గించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేశ్వరి అన్నారు. శుక్రవారం బోధన్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆశావర్కర్లతో పాటు వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్లు గర్భిణులకు ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించాలని పేర్కొన్నారు. గైనకాలజిస్టు వైద్యులు మానవత్వంతో వైద్య సేవలు అందించాలన్నారు. అత్యవసరం అయితే తప్ప జిల్లా కేంద్రానికి రిఫర్ చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరిండెంట్ రాహుల్, ఆర్ఎంవో డాక్టర్ రహీంలతో వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్



శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ

బోధన్‌రూరల్,ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): ప్రజలు శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి పండుగలను, శోభాయాత్రలను ప్రశాంతంగా జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని టీటీడీ కల్యాణ మండపంలో శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సున్నితమైన డప్పువాయిద్యాలతో పండుగలు జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ వెంకట నారాయణ, రూరల్ సీఐ విజయ్ బాబులతో అన్ని మండలాల ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, హిందు సంఘాల నాయకులు, హనుమాన్ స్వాములు, శ్రీరామ ఆలయ కమిటీ నిర్వాహకులు, హనుమాన్ ఆలయ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరి : శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి వేడుకలను ప్రజలు శాంతియుతంగా జరుకోవాలని రుద్రూరు సీఐ కృష్ణ సూచించారు. రుద్రూరు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయా గ్రామాల నాయకులతో శాంతి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా డీజేలు ఏర్పాటు చేసి ఇతరులకు ఇబ్బంది కలిగించవద్దని సూచించారు. కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు సాయన్న, సందీప్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చందూర్‌లో డీఎల్‌పీవో తనిఖీ

మోస్రా, ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): చందూర్ మండలంలో శుక్రవారం డీఎల్‌పీవో నాగరాజు పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీని తనిఖీ చేశారు. లక్మాపూర్ గ్రామ పంచాయతీని సందర్శించి నర్సరీ, కంపోస్ట్‌షెడ్, వైకుంఠధామం పరిశీలించారు. ఇందులో భాగంగా పంచాయతీ రిజిష్టర్ తనిఖీ చేశారు. అదే విధంగా చందూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ సందర్శించి ఎల్ఆర్ఎస్ గురించి కార్యదర్శిని అడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారని ఎంపీడీవో నీలావతి తెలిపారు. డీఎల్‌పీవో మొదటిసారి లక్మాపూర్ గ్రామం వచ్చిన సందర్భంగా ఆయనను గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేందర్ శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో లక్మాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి నరేందర్, చందూర్ కార్యదర్శి శ్రీనివాస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే ఇసుక అనుమతులు

● జిల్లా మైనింగ్ ఏడీ విజయ్‌కుమార్ రాథోడ్

కోటగిరి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): స్థానిక అవసరాలకు నిబంధనల మేరకు ఇసుక అనుమతులు ఇస్తున్నట్లు జిల్లా మైనింగ్ ఏడీ విజయ్ కుమార్ రాథోడ్ పేర్కొన్నారు. కోటగిరి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం తహసీల్దార్ గంగాధర్‌తో ఆయన సమావేశమయ్యారు. పోతంగల్ మండలంలోని మంజీర నది తీరంలో ఇసుక అనుమతులపై ఆరా తీశారు. కోటగిరి, వర్ని, రుద్రూరు, చందూర్, మోస్రా మండలాల పరిధిలో ఇందిరమ్మ ఇళ్లు, ప్రభుత్వ పనులకు ఇసుక అనుమతులు ఇస్తున్నట్లు తహసీల్దార్ వివరించారు. ట్రాక్టర్‌కు 660రూపాయల చొప్పున డీడీ తీసుకుని ఇసుక పర్మిట్లు జారీ చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకు ప్రభుత్వ ఖజానాకు 23లక్షల రూపాయలు జమ చేసినట్లు ఆయన తెలిపారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

'కొనుగోలు కేంద్రాలు వినియోగించుకోవాలి'

బోధన్‌రూరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శుక్రవారం బోధన్ మండలంలోని పెంటాఖుర్దు గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, ఇతర అన్ని రకాల వసతులు కల్పించాలన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు రికార్డులను పరిశీలించారు. రైతులు దళారులకు ధాన్యం విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. ఆయన వెంట సంబంధిత శాఖ అధికారులు తదితరులున్నారు. మహిళ సంఘాల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను మహిళ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. శుక్రవారం బోధన్ మండలంలోని రాంపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు.

కోటగిరి: రైతులకు గిట్టుబాటు ధరను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోటగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతు సూచించారు. మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ గంగాధర్, వీండో అధ్యక్షులు కూచి సిద్దు, ఏఎంసీ వైస్ చైర్మన్ అనిల్ పాల్గొన్నారు. రుద్రూరు మండలంలోని సిద్దాపూర్ గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబు ప్రారంభించారు.

రెంజల్ : రైతులు పండిస్తున్న ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ మొబిన్ ఖాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని బాగేపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని దళారుల పాలు చేయకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు.

ఎడపల్లి : మండలంలోని ఎడపల్లి, కుర్నాపల్లి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం రాష్ట్ర అధికారులు తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు నీళ్ళు, నీడ కల్పించాలని సూచించారు. తనిఖీలో రాష్ట్ర సివిల్ సప్లై, ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్, తూనికలు కొలతల అధికారులు పాల్గొన్నారు.

మోర్తాడ్:మండలంలోని పాలెం, మోర్తాడ్ గ్రామాలలో శుక్రవారం ఐకేపీ ఆధ్వర్యంలో వరి కోనుగోలు కేంద్రాలను నాయకులు ప్రారంభించారు. పాలెంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సయ్య కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరక్టర్లు మహిపాల్, నవీన్ పాల్గొన్నారు.

డొంకేశ్వర్ : కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డొంకేశ్వర్ సొసైటీ చైర్మన్ భరత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని గాదెపల్లి గ్రామంలో వరికొనుగోలు కేద్రాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలలో వరిధాన్యం విక్రయిస్తే బోనస్‌గా కూడా వస్తుందని తెలిపారు.

రేషన్‌షాపులలో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

ఎడపల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర టాస్క్ ఫోర్స్ అధికారులు శుక్రవారం పలు రేషన్ దుకాణాలను తనిఖీలు చేశారు. ఇందులో భాగంగా ఎడ పల్లి మండల కేంద్రంలోని 3వ నెంబరు రేషన్ దుకాణాన్ని, దాంతో పాటు మండలంలోని బాపునగర్ గ్రామంలో గల రేషన్ దుకాణాన్ని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బియ్యం బస్తాల తూకాన్ని, బియ్యం నాణ్యతను పరిశీలించారు. అనంతరం రాష్ట్ర ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్ఓ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ రేషన్ దుకాణాల్లోకి వచ్చిన బియ్యం బస్తాల తూకంలో తేడా ఉందని రేషన్ దుకాణదారుడు తెలుపగా బియ్యం బస్తాల తూకాన్ని పరిశీలించగా బస్తా 50 కిలోలు ఉందన్నారు. బాపునగర్, వడ్లాపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాలతో కలిపి 7 క్వింటాళ్ళ 31కిలోల బియ్యం తక్కువగా వచ్చాయని గుర్తించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆయనతోపాటు టాస్క్‌ఫోర్స్ ఎస్సై ఎన్. శ్రీనివాస్ రావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉపతహసీల్దార్ ఎం. శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

● ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్



మెండరలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం

మెండోర, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్, మండల పార్టీ అధ్యక్షుడు కొత్తింటి ముత్యం రెడ్డి అధ్యక్షతన జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ పాదయాత్ర ముగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సలీం, టౌన్ అధ్యక్షుడు గుండోజి రవి పాల్గొన్నారు.

ముప్కాల్ : బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ముత్యాల సునీల్‌కుమార్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ ప్రజలకు సమాన హక్కులు కల్పించిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ భారతీయ పౌరుడిపై ఉందన్నారు.

ఆర్మూర్ రూరల్ : దేశ ప్రజలకు సమానహక్కులను అందించిన భారత రాజ్యాంగాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత ప్రతీభారతీయ పౌరుడిపై ఉందని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముని పల్లిసాయిరెడ్డి శుక్రవారం అన్నారు. ఆలూర్ మండల కేంద్రం, దేగాం గ్రామంలో జైభీమ్, జైబాపు, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు.

నవీపేట్: మండలంలోని నాగేపూర్, ఫకీరాబాద్, మిట్టాపూర్, యంచ, మద్దెపల్లిలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతిరెడ్డి రాజిరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, లక్ష్మీనారాయణ గౌడ్, శ్రీనివాస్, గోపాల్ లున్నారు.

నందిపేట : మండలంలోని తల్వేద గ్రామంలో శుక్రవారం జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ నిర్వహించారు. ఇందులో భాగం గా మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి, కాంగ్రెస్ పార్టీ జెండాలను ఎగరవేశారు. కార్యక్ర మంలో మండల పార్టీ అధ్యక్షులు మంద మహిపాల్, చింరాజ్‌పల్లి సొసైటీ చైర్మెన్ బొంకం గంగారెడ్డి నాయకులున్నారు.

బోధన్‌రూరల్ : రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్ అన్నారు. బోధన్ పట్టణంతో పాటు మండలంలోని హున్స, ఖాజాపూర్, ఆయా గ్రామాలలో శుక్రవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పాషా మొయినోద్దీన్, మార్కెట్ కమిటీ ఇన్‌చార్జి చైర్మన్ శంకర్, మండల అధ్యక్షులు నాగేశ్వర్ రావులున్నారు.


ఎడపల్లి : ప్రజాస్వామ్య పరిరక్షణ అందరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షులు యాదగిరి అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్ రావు, సంజయ్ ఉన్నారు.

వేల్పూర్ : మండలంలోని కొత్తపల్లి, వాడి, అక్లూర్, మోతె, రామన్నపేట్ గ్రామాలలో జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్ర మాన్ని శుక్రవారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నర్సారెడ్డి ప్రారంభించారు.

రెంజల్ : ప్రజాస్వామ్య పరిరక్షణకు అందరి బాధ్యత అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మొబిన్ ఖాన్ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకులు కళ్యాపూర్, కిసాన్ తండా, కూనేపల్లి, బాగేపల్లి గ్రామాలలో పాదయాత్ర నిర్వహించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసే బాధ్యత అధికారులదే

● ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్ ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వపథకాలు ప్రజలకు చేరవేసే బాధ్యత అధికారులపైనే ఉందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాప్ కార్యాలయంలో శుక్రవారం నియోజక వర్గ పరిధిలోని వివిధ మండలాల, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవి కాలంలో గ్రామీణ ప్రాంతాలలో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులకు సూచించారు. పైలెట్ ప్రాజెక్టు కింద వివిధ మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు ఎంత వరకు వచ్చాయని అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలో నిర్మిస్తున్న నివాస గృహాలకు మున్సి పల్ అనుమతితోని నిర్మాణాలు చేపట్టాలని, లేని పక్షంలో వాటి నిర్మాణాలను అడ్డుకోవాల ని ఆదేశించారు. ఇప్పటివరకు వేసిన వెంచర్లలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉండేలా చూడాలని ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ప్రభుత్వభూములను గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైన, ఎవరైనా ప్రభుత్వ భూములను, ఇరిగేషన్ భూములను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తే వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఆర్డీవో రాజాగౌడ్, మున్సిపల్ కమిషనర్ రాజు, వివిధ మండలాల అధికారులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



బీటీ రోడ్డు ప్రారంభిస్తున్న మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ నర్సారెడ్డి

వేల్పూర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ నుంచి పచ్చలనడ్కుడ గ్రామం వరకు బీటీ డబుల్‌రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం వేల్పూర్ మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ గడ్డం నర్సారెడ్డి ప్రారంభించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యత పాటించేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. మండలకేంద్రానికి వెళ్ళేందుకు పచ్చలనడ్కుడ, వాడి, కొత్తపల్లి గ్రామాల ప్రజలకు ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు మల్లేష్, జిల్లా కార్యదర్శి దామోదర్‌గౌడ్, సహకార సంఘం డైరెక్టర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీవో

వేల్పూర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని 102 అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీవో సాయిలు పరిశీలించారు. కేంద్రంలోని పిల్లల హాజరు రికార్డు, ప్రభుత్వం సరఫరా చేసిన పౌష్టికాహారానికి సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలని అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, పిల్లలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

కోటగిరి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కోటగిరి ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కోటగిరి జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం మధ్యాహ్నభోజనాన్ని ఎంపీడీవో తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట ఎంఈవో శ్రీనివాస రావు తదితరులున్నారు.

న్యూసెన్స్‌కేసులో ఇద్దరికి జైలు

బోధన్‌రూరల్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): బోధన్ రూరల్‌పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు వ్యక్తులు ప్రతిరోజు తాగి మద్యం మత్తులో డయల్ 100కు కాల్‌చేసి పోలీసుల విధులను దుర్వినియోగం చేస్తున్నారని బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. వారిని గుర్తించి బోధన్ కోర్టులో హాజరుపర్చగా కోర్టు న్యాయాధికారి శేషతల్ప సాయి వారికి రెండు రోజుల పాటు జైలుశిక్ష విధించారన్నారు. బోధన్ పట్టణంలోని గోశాల రోడ్డులో రాత్రి టీస్టాల్ నిర్వహించడంతో శుక్రవారం అతనిని కోర్టులో హజరుపర్చగా న్యాయాధికారి ఒకరోజు జైలుశిక్ష విధించారన్నారు. యాక్సిడెంట్ కేసులో నిందితుడికి బోధన్ కోర్టు న్యాయాధికారి 10వేల రూపాయల జరిమానా విధించారని బోధన్ పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. పూజిత అనే మహిళకు 2019లో జరిగిన యాక్సిడెంట్ ఘటనలో శుక్రవారం కోర్టులో వాదోపవాదలు విన్న న్యాయాధికారి మహ్మద్ రాఫే అనే నిందితుడికి రూ.10వేల జరిమానా విధించారు.

మప్కాల్ : మండలంలోని నల్లూర్ గ్రామానికి చెందిన వయ్య నిఖిల్ మద్యం సేవించి వాహనం నడుపగా డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పోలీసులకు పట్టుబడ్డాడు. ఆర్మూర్ కోర్టు మెజిస్ట్రేట్ ఒక రోజు జైలు శిక్ష విధించినట్లు ముప్కాల్ ఎస్సై రజినీకాంత్ తెలిపారు.

ఆర్మూర్ టౌన్ :100 డైల్‌కు ఫోన్ చేసి న్యూసెన్స్ చేసిన రాజ్ కుమార్ అనే వ్యక్తికి శుక్రవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గట్టు గంగాధర్ మూడురోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

రెడ్డికా సంఘం మండల అధ్యక్షుడిగా బోయిడి శ్రీనివాస్ ఎన్నిక

నవీపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రెడ్డికా సంఘం మండల కమిటీ సమావేశం శుక్రవారం మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలోని ఫకీరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డికా సంఘం మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బోయిడి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా చందరి ప్రవీణ్, కోకా రాజేశ్వర్, బుయ్య శ్రీనివాస్, జడల నర్సయ్య, ప్రధాన కార్యదర్శిగా దీటీ సురేష్, కార్యదర్శిగా ఎత్తొండ గంగాధర్, కోశాధికారిగా జడల దేవరాజ్, సంయుక్త కార్యదర్శులు లొట్ట శివ కుమార్, ముద్ద శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా పెంట అబ్బన్న, గుమ్మల బాలరాజులను ఎన్నుకున్నారు.

బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీగా సాగర్

బోధన్‌రూరల్,ఏప్రిల్4(ఆంధ్రజ్యోతి): బోధన్ కోర్టు బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీగా సాగర్‌ను శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు ఆయనను సన్మానించారు. న్యాయవాదుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు నర్సింహా రెడ్డి, కోటేశ్వర్ రావు, సీనియర్ న్యాయవాదులు తదితరులున్నారు.

జన్నేపల్లి ఎస్ఎస్ఆర్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

నవీపేట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జన్నేపల్లి ఎస్ఎస్ఆర్ సీనియర్ సెకండరీ సీబీఎస్ఈ పాఠశాలలో శుక్రవారం పట్టభద్రుల రోజు నిర్వహించారు. పూర్వ ప్రాథమిక విద్య పూర్తి అయిన విద్యార్థులు ప్రాథమిక పాఠశాలలో అడుగు పెడుతుండగా ప్రాథమిక పాఠశాల స్థాయి పూర్తి చేసుకుని ఉన్నత పాఠశాలలోకి అడుగు పెడుతున్న విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ మారయ్య గౌడ్, సీఈవో హరిత గౌడ్, ప్రిన్సిపాల్ భాస్కర్, డైరెక్టర్ హర్షిత్ గౌడ్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగిపై దాడి.. రూ.5 వేల జరిమానా

మెండోర, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోచంపాడు గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగి అసిస్టెంట్ లైన్‌మెన్ అరిఫ్ హుస్సేన్‌పై దాడి చేసిన రాహుల్ అనే వ్యక్తికి రూ.5000 ఆర్మూర్ మెజిస్ట్రేట్ న్యాయాధికారి దీప్తి వేముల తీర్పు వెలువరించారని ఎస్సై నారాయణ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం 2019 సంవత్సరంలో మెండోర మండలం పోచంపాడ్ గ్రామానికి చెందిన బండారి మోహన్‌సింగ్, రాహుల్ అదే గ్రామంలో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వస్తున్న అరిఫ్ హుస్సేన్ డ్యూటీలో ఉన్న సమయంలో అనవసరంగా అతనితో గొడవ పెట్టుకుని నిందితుడు తన చేతికి ఉన్న కడియంతో కొట్టి గాయపరిచాడని మెండోర పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదదు అయింది. అప్పటి ఎస్సై కృష్ణమూర్తి కేసు నమోదు చేసి ఆర్మూర్ కోర్టులో చార్జిషీట్ దాఖాలు చేయగా ఏపీపీజీ రామకృష్ణ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు కావడంతో రూ.5000 జరిమానా విధించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):మండలంలోని బాలనగర్, సికింద్రాపూర్ గ్రామాల మధ్య 44వ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీ కొని డిచ్‌పల్లి మండలం మెంట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన బైరం రవీంద్రవర్మ (37) మృతిచెందినట్లు ఎస్సై సీహెచ్ తిరుపతి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు ప్రకారం గురువారం రాత్రి ఆర్మూర్ వైపు నుంచి ఇంటికి నడుచుకుంటు డిచ్‌పల్లివైపు వెళ్తుండగా వెనుకనుంచి గుర్తుతెలియని వాహనం అతనిని ఢీ కొందని తెలిపారు. తీవ్ర గాయాలైన బైరం రవీంద్రవర్మను చికిత్స నిమిత్తం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం బైరం రవీంద్రవర్మ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తు దర్యాప్తు చేస్తున్నారన్నారు.

విద్యారులు ఉన్నత స్థాయికి ఎదగాలి : బాల్కొండ ఎమ్మెల్యే

వేల్పూర్, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థానంలో నిలిచి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువులో లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటి సాధనకు కృషిచేస్తే విజేతలుగా నిలుస్తారన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు లక్మారెడ్డి, సంజీవ్‌రెడ్డిలను ఎమ్మెల్యే సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి, ఎంఈవో రేణుక, హెచ్ఎం రాజన్న పాల్గొన్నారు.

కన్కల్-చందాపూర్ రోడ్డుకు మోక్షం కలిగేనా..!?

● కంకర తేలిన రోడ్డుతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు, రైతులు ● కన్నెత్తి చూడని అధికారులు
● రోడ్డు బాగుపడితే మూడు గ్రామాల ప్రజలకు తీరనున్న కష్టాలు



కంకర తేలి ఇబ్బందికరంగా ఉన్న కన్కల్, చందాపూర్ రోడ్డు

తాడ్వాయి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఒకపక్క గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తుంటే అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ఎల్లారెడ్డి నియోజకవర్గ గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు పనిచేస్తుంటే మా గ్రామ రోడ్డును కూడా బాగు చేయాలని గ్రామస్తులు అంటున్నారు. గ్రామీణ రోడ్లు బాగుపడి రైతుల కష్టాలు తీర్చాలని పదేపదే అధికారులకు చెబుతున్నారు. కానీ మండలంలోని కన్కల్ - చందాపూర్ రోడ్డుకు మాత్రం మోక్షం కలగడం లేదు. గత 20 సంవత్సరాల క్రితం కంకర రోడ్డు కన్కల్ మీదుగా చందాపూర్ వరకు వేశారు. దీనితో కన్కల్, చందాపూర్, దేవాయిపల్లి, కాళోజి వాడి, సంగోజువాడి, బ్రాహ్మణపల్లి మీదుగా ఎన్‌హెచ్ 47 హైవే రోడ్డుకు దగ్గరగా ఉంటుంది. ఈ రోడ్డు మరమ్మతులు లేక రైతులకు ప్రయాణికులకు చాలా ఇబ్బందికరంగా తయారయింది. వర్షాకాలం అయితే రైతుల బాధలు వర్ణనాతీతం. రోడ్డుపై నడవాలంటేనే రైతులు ప్రయాణికులు వర్షాకాలం భయపడుతున్నారు. ఈ రోడ్డు బాగు చేయడంతో మూడు గ్రామాల రైతులకు ప్రయాణికులకు ఎంతో అనుకూలంగా ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. ప్రభుత్వం గ్రామీణ రోడ్లకు మహర్దశ తీసుక వస్తుంటే కొన్ని పల్లెల్లోని రోడ్లు యథావిధిగా ఉంటున్నాయి. అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు అంటున్నారు. తమ బాధలు ఎప్పుడు తీరుతాయోనని చందాపూర్ గ్రామ రైతులు ఎదురు చూస్తున్నారు. వర్షాకాలం రోడ్డుపై నడవలేని స్థితిలో ఉంటుందని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. ఈ రోడ్డు రైతుల పంటచేళ్లలోకి పోవడానికి అనువుగా ఉంటుందని చందాపూర్, కన్కల్ గ్రామస్థులు అంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ఈ రోడ్డును మరమ్మతు చేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే తమ గ్రామంపై దృష్టి సారించి రోడ్డును బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుకుంటున్నారు.

● వర్షాకాలంలో రోడ్డుపై నడవాలంటే ఇబ్బంది



వర్షాకాలంలో రోడ్డుపై నడవాలంటే చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. రైతులు ఎరువులను తీసుకువెళ్లాలంటే కష్టంగా తయారైంది. ఈ రోడ్డు బాగు చేయడంతో మూడు గ్రామా ల ప్రజలకు, రైతులకు అనుకూలంగా ఉంటుంది.

- పైడి విఠల్‌రెడ్డి, రైతు, చందాపూర్

● రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి



ఈ రోడ్డుతో మూడు గ్రామాల ప్రజలకు, రైతులకు అనుకూలంగా ఉంటుంది. ఈ రోడ్డు ఎన్‌హెచ్47 హైవేకు దగ్గరగా ఉంటుంది. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

- రాజేశ్వర్‌రెడ్డి, రైతు, చందాపూర్

ఘటా.. ఘట్...

ఐదు శాతం రాయితీతో పన్నులు చెల్లించాలి

● రాజు, మున్సిపల్ కమిషనర్



పట్టణ ప్రజలు ఈ నెలాఖరు వరకు ఇంటి పన్నులకు ఐదు శాతం ముందస్తు రాయితీని వినియోగించుకొని ఇంటి పన్నులు చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ రాజు 'ఆంధ్రజ్యోతి' కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రజలను కోరారు.

ఆంధ్రజ్యోతి: 2024-25 సంవత్సరంలో ఇంటి పన్నులను ఎంత వరకు వసులు చేశారు?

కమిషనర్: మార్చి 31 వరకు 77.86 శాతం ఇంటి పన్నులను బిల్ కలెక్టర్లు ప్రజల సహకారంతో వసూలు చేశాము. దీంతో మున్సిపల్‌కు 5 కోట్ల 40 లక్షలు ఆదాయం సమకూరింది. లక్ష్యాన్ని చేదించడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: .పన్ను వసూల్లో ఉమ్మడి జిల్లాలో ఏ స్థానంలో ఉంది?

కమిషనర్: ఉమ్మడి జిల్లాలో పన్ను వసూలు మొదటి స్థానం రావడంతో సీడీఎంఏ అధికారులు ప్రశంస పత్రాన్ని అందజేశారు. దీంతో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.కోటి 84 లక్షల లక్ష్యాన్ని చేదించినాం.

ఆంధ్రజ్యోతి: ట్రేడ్ లైసెన్స్ పన్ను ఎంత వరకు వసూలు చేశారు.?

కమిషనర్: 2024-25 సంవత్సరానికి సుమారు 2వేల ట్రేడ్ లైసెన్స్‌లకు రూ. 50 లక్షల వరకు పన్ను వసూలు చేశాం. ఇదియే కొన్నింటికి ముందస్తు రెన్యూవల్ కూడా చేయించాం.

ఆంధ్రజ్యోతి: ఎల్‌ఆర్‌ఎస్‌ను ఎంతమంది లబ్ధిదారులు వినియోగించుకున్నారు?

కమిషనర్: మున్సిపల్ పరిధిలో 3100 లబ్ధిదారులకు గాను 1070 ఎల్ఆర్ఎస్ ను వినియోగించుకున్నారు. ఈ నెల 30 వరకు 25 శాతం రాయితీతో లబ్ధిదారులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఆంధ్రజ్యోతి: మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతున్నారా?

కమిషనర్: ఇటీవల టీయుఎఫ్ఐడిసి నిధులు 14 కోట్లు మంజూరు అయ్యాయి. వారం రోజుల్లో టెండర్లను ఆహ్వానించి వార్డులలో అత్యవసరమైన డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లలను చేపడతాం.

● (ఆర్మూర్ టౌన్, ఆంధ్రజ్యోతి)



గ్రాడ్యుయేషన్ డేలో పాల్గొన్న వైద్య విద్యార్థినులు

వైద్య కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో శుక్రవారం రాత్రి 7వ గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. 2019 బ్యాచ్‌కు చెందిన 119 మంది వైద్య విద్యార్థులకు వైద్య పట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గాంధీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ కె.ఇందిర హాజరై పట్టాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ శివప్రసాద్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్స్ నాగమోహన్, కిశోర్‌కుమార్, జలగం తిరుపతిరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ రవికిరణ్, సరస్వతి, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.



నెలాఖరు లోగా దుకాణ సముదాయల టెండర్లు పూర్తి

● ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న



డిచ్‌పల్లి బస్టాండ్‌లో ఆర్టీసీ బస్సుల వివరాలను తెలుసుకుంటున్న ఆర్ఎం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): డిచ్‌పల్లి బస్టాండు ఆవరణలో చిరు వ్యాపారుల కోసం వ్యాపార సముదాయల టెండర్‌ల ప్రక్రియ ఏప్రిల్ నెలకారు లోపు పూర్తి చేస్తామని వ్యాపారులు ఈ ఆవకాశం సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జ్యోత్స్న అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం డిచ్‌పల్లి ఆర్టీసీ బస్టాండ్‌ని డీఎం ఆనంద్‌తో కలిసి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండులో సౌకర్యాలు స్వయంగా పరిశీలించారు. ప్రయాణికులకు తాగునీటి సదుపాయం, ప్యాన్లు బాగు చేయించాలని కంట్రోలర్ చందర్ రాథోడ్‌కు సూచించారు. నామినేషన్ ప్రక్రియ వ్యాపార సముదాయలకు ఆరు నెలల పాటు మాత్రమే ఉంటుందని అలా వ్యాపార సముదాయలు కావల్సిన వారు సంప్రదించాలని సూచించారు. బస్టాండ్‌లో మూత్రశాలల పక్కన అపరిశుభ్రంగా ఉన్న కంకర కుప్పలను తీసివేయాలని ఆదేశించారు. సముదాయంలోని 10మడిగెలు టెండర్‌ల ప్రక్రియలో పాల్గొనేందుకు ప్రతీ ఒక్కరికి ఆవకాశం కల్పిస్తున్నామని తెలిపారు. అన్ని డిపోల ఆర్టీసీ నాన్‌స్టాప్, రాజదాని బస్సులు తప్ప మిగతా బస్సులకు డిచ్‌పల్లి బస్టాండ్‌లో స్టాప్ కల్పించామని పేర్కొన్నారు. ఆమె వెంట డిపో మేనేజర్ ఆనంద్, అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణ, కంట్రోలర్ చందర్‌నాయక్ ఉన్నారు.

కాంటా పెట్టరు.. వడ్లు కొనరు!

● మేచర్ వచ్చినా కూడా ధాన్యం వైపు కన్నెత్తిచూడని అధికారులు
● కళ్లాల్లోనే పొద్దు పోగొట్టుకుంటున్నరైతులు ● చిరు జల్లులకు తడిసి ముద్దవుతున్న ఎండిన ధాన్యం

నసురుల్లాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఎప్పటికప్పుడు ధాన్యం కొనుగోలు చేయాలన్న ప్రభుత్వ ఆదేశాలను బేఖాతారు చేస్తూ రైతులకు ఇబ్బందులు గురిచేస్తున్న దుర్కి సహకార సంఘ అధికారుల తీరుపై పలువురు రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతినిత్యం కలెక్టర్ సమావేశాలు ఏర్పాటు చేస్తూ ధాన్యాన్ని వెంటనే కొనాలి అని చెప్పినా కూడా, పెడ చెవిన పెడుతున్న సహకార సంఘ అధికారుల తీరుపై రైతులు మండి పడుతున్నారు. నసురుల్లాబాద్ మండలంలోని అంకోల్ తండా గ్రామంలో వడ్లు ఎండపోసి వారం రోజులు గడుస్తున్నా కూడా సంబంధిత అధికారులు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి వడ్లు కొనుగోలు చేయక పోవడం విడ్డూరం. దీంతో గురువారం పడిన చిరుజల్లులకు వడ్లు తడిసిముద్దవుతున్నాయని, వడ్లు కొనుగోలు చేయకపోవడంతో రైతులు రాత్రి పగలు వడ్ల కల్లాల్లోనే పొద్దు పోగొట్టుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కంటాను ఏర్పాటు చేసి, వడ్లు కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు.

● కాంటాను ఏర్పాటు చేసి వడ్లు కొనాలి



తాము కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని సొసైటీ అధికారులు కాంటాను ఏర్పాటు చేసి తమ వద్ద నుంచి వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి.

- కేతావత్ మోహన్, రైతు

● కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు



పంట పొలాల్లో కోసి వారం రోజులు అయింది. కాని ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయక పోవడంతో రోడ్లపై వడ్లను ఎండ పోసుకుంటున్నాం.

- లచ్చిరాం, రైతు, అంకోల్ తండా

● చిరు జల్లులకు వడ్లు తడిసాయి



గురువారం పడిన చిరు జల్లుల కు రోడ్డుపై ఆర బెట్టిన వడ్లు తడి సాయి. సొసైటీ అ ధికారులు స్పందించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

- పవన్, రైతు



గ్రామ పంచాయతీ భవనం



ఆజామాబాద్ గ్రామంలో రోడ్డుపైనే చెత్త



వెల్లుట్ల పేటలో వృథాగా పోతున్న తాగునీరు

ప్రత్యేక పాలన.. అస్తవ్యస్తం

● గ్రామాలకు వెళ్లని ప్రత్యేక అధికారులు
● కార్యదర్శులపైనే పెరిగిన పని భారం
● పట్టించుకోని అధికారులు

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ప్రస్తుతం ఏదైనా సమస్య ఉంటే ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితి నెలకొంది. సర్పంచుల పదవీకాలం ముగియడంతో గత ఏడాది ఫిబ్రవరి 1వ తేదీ నుంచి గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించిన విషయం విధితమే. వాటిని పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శులపై పనిభారం ఎక్కువ అవు తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● మండలంలో 31 గ్రామ పంచాయతీలు

ఎల్లారెడ్డి మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. గత ఏడాది జనవరి 31వ తేదీ వరకు సర్పంచుల పాలన కొనసాగగా ఫిబ్రవరి 1 నుంచి ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైంది. దీంతో సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన తరువాత వారికి రావాల్సిన బిల్లులు రాకపోవడంతో వారు గ్రామాల జోలికి వెళ్లడం లేదు. గ్రామ పంచాయతీలకు కేటాయించిన అధికారులు ప్రత్యేక కార్యక్రమం అంతే తప్పా ఆ గ్రామాల వైపు కన్నెత్తి చూడటం లేదు. ఈ క్రమంలో ఆయా గ్రామాల్లో ప్రత్యేక పాలన అస్తవ్యస్తంగా తయారైంది. గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారుతుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

● నిధుల లేమితో ఇబ్బందులు

ప్రత్యేక అధికారుల పాలనలో కేంద్రం నుంచి వచ్చే నిధులు రాకపోవడంతో రాష్ట్రం నుంచి వచ్చే గ్రాంట్ అంతంత మాత్రమే ఉండటంతో పాలన కష్టతరంగా మారిందని కార్యదర్శులు వాపోతున్నారు. అంతే కాకుండా వీధి దీపాల ఏర్పాటు, ట్రాక్టర్, డీజిల్ ఇతర ఖర్చులకు నిధుల సమస్య ఎక్కువైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో అప్పులు చేసి పనులు చేయించాల్సి వస్తుందని చెబుతున్నారు.

● సమన్వయ లోపం

ప్రభుత్వ కార్యక్రమాలు విజయ వంతం చేసేందుకు గ్రామస్థాయి లోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాల్సి ఉంటుంది. కాని ఈ విషయాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులు గ్రామాల వైపు శ్రద్ధ చూపించడం లేదు. దీంతో ఆయా గ్రామాల్లో పాలన కుంటు పడుతుంది. చాలా గ్రామాల్లో ప్రత్యేక అధికారులు ఎవరనేది కూడా నేటికీ తెలియని పరిస్థితి నెలకొంది. ప్రతీ గ్రామంలో చెత్తాచెదారం పేరుకు పోవడంతో పాటు మురుగు ఏరులై పారుతుంది. ప్రత్యేక అధికారులు ఈనాడు గ్రామాలకు వచ్చి క్షేత్ర స్థాయిలో తిరిగి సమస్యలను పరిష్కరించిన దాఖలాలు లేవని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రత్యేక అధికారులు వారికి కేటాయించిన గ్రామాల్లో పర్యటించి ఆయా సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.



వెల్లుట్లపేటలో మురికి కాలువలో నిండిన మురుగు నీరు



వృథాగా ఉన్న పశువుల నీటి తొట్లు

ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): సుద్దపల్లి గురుకుల పాఠశాల వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరైన కార్మిక విభాగం అధికారి యోహాన్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు మంచిగా చదువుకొని భవిష్యత్తులో రాణించలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నళిని, ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయులు ఉన్నారు.





సుద్దపల్లి గురుకుల పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పక్షుల దాహార్తి తీర్చేందుకు నీటి వసతి

ఎల్లారెడ్డి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలంలోని దావల్ మల్కాపల్లి గ్రామంలో ఎంపీడీవో ప్రకాశ్ వేసవికాలం దృష్ట్యా పక్షులకు తాగునీటి ఎద్దడి తీర్చడం కోసం గ్రామపంచాయతీ ఆవరణలో వృక్షాల కొమ్మల వద్ద ప్లాస్టిక్ డబ్బాలలో నీటిని నింపి పక్షులకు తాగునీరు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ప్రకాష్ పేర్కొన్నారు. ప్రతీఒక్కరు ఇంటి ఆవరణలో పక్షుల తాగునీటి కోసం డబ్బాలలో నీటిని నింపి ఇంటి ఆవరణలో పెట్టాలని తెలిపారు. ఆయనతో పాటు పంచాయతీ కార్యదర్శి సిబ్బంది ఉన్నారు.



దావల్ మల్కాపల్లిలో పక్షులకు ఏర్పాటు చేసిన తాగు నీరు

సన్నబియ్యం పంపిణీని పకడ్బందీగా పర్యవేక్షించాలి

(ఐదో పేజీ తరువాయి)

సన్నబియ్యం నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. సన్నబియ్యం పంపిణీ ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని ఎక్కడైనా అవినీతి అక్రమాలకు పాల్పడితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏప్రిల్ 6న శ్రీరామనవమి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలం పర్యటనకు హాజరుకానున్నారని ఈ సందర్భంగా సన్నబియ్యం స్వీకరించిన దళిత గిరిజన కుటుంబాలతో కలిసి సీఎం భోజనం చేస్తారని మంత్రి తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న సన్నబియ్యం పథకం ప్రాముఖ్యతను తెలిపేలా జిల్లాలో కూడా వీలైతే ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానించి నిరుపేదల ఇళ్లలో, కాలనీలలో వారితో కలిసి సన్నబియ్యంతో వండిన భోజనం చేయాలని పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమం నిర్వహించాలని మంత్రి కలెక్టర్లకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఆర్‌డీవో సాయాగౌడ్, డీఎస్‌వో అర్వింద్‌రెడ్డి, డీసీవో శ్రీనివాస్, మెప్మాపీడీ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు

బాధిత రైతులను ఆదుకోవాలి

సుభాష్‌నగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవల అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్న బాధిత రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి అన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు శుక్రవారం లేఖ రాశారు. రెండు సార్లు పడిన వర్షాలకు ధాన్యం తడవడంతో పాటు చేతికి వచ్చిన పంట దెబ్బతిందన్నారు. జిల్లా యంత్రాంగం పట్టించుకోకపోవడం వల్ల రైతులకు నష్టపరిహారం రావడం లేదన్నారు. అకాల వర్షాలు పడుతుండటం వల్ల ధాన్యం తడుస్తుందని కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, మహిళా సంఘాల ద్వారా కొనుగోలు త్వరగా చేపట్టాలన్నారు. ఎమ్మెల్యేలు సిఫారసు చేసుకున్న వారికే కొనుగోలు కేంద్రాలు అవకాశం ఇవ్వడం వల్ల ఉపయోగం లేదన్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించిన ధాన్యం సేకరించడం లేదని ఆయన ఆరోపించారు. త్వరగా ధాన్యం సేకరించకపోతే రైతుల నుంచి తీవ్ర నిరసన ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన ఆ లేఖలో తెలిపారు.

జీహెచ్‌ఎంలకు ఉప విద్యాధికారులుగా పదోన్నతులు ఇవ్వాలి



సమావేశంలో పాల్గొన్న గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు 2005 నుంచి అదే క్యాడర్‌లో పనిచేస్తూ పదోన్నతి పొందడం లేదని ఖాళీగా ఉన్న ఉపవిద్యాధికారి పోస్టుల్లో ఉమ్మడి సీనియారిటీ ప్రకారం పదోన్నతులు ఇవ్వాలని జిల్లా గెజిటెడ్ ప్రధానో పాధ్యాయుల సంఘం సమావేశంలో తీర్మానించారు. శుక్రవారం బోర్గాం(పి) పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. అర్హులైన వారికి బీఈడీ కళాశాలల్లో, డైట్ కళాశా లల్లో సీనియర్ లెక్చరర్లుగా పదోన్నతులు ఇవ్వాలని, పీజీ ఎంఈడీ అర్హత లు ఉన్న జీహెచ్‌ఎంలకు డైట్ కళాశాల లెక్చరర్లుగా బదిలీలు చేయా లన్నారు. మండల విద్యాధికారి పదోన్నతులు కేవలం ఉమ్మడి రాష్ట్రంలో 2005లో ఇచ్చారని వారిలో 95 శాతం మంది ఇప్పటికే రిటైర్డ్ అయ్యారని జూనియర్ లెక్చరర్ల పదోన్నతులు 2001లో, డైట్ లెక్చరర్ల పదోన్నతులు 2000 సంవత్సరంలో ఇచ్చారని అన్నారు. ఈ సమావేశంలో వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, టీఎస్‌జీహెచ్‌ఎంఏ ఆర్థిక కార్యదర్శి ధృపదకుమార్, రామకృష్ణ, వేణుగోపాల్, రాజన్న, హరిచరణ్, మాదవి, సంధ్యారాణి పాల్గొన్నారు.

మహిళను హత్య చేసిన వ్యక్తి అరెస్టు

ఖిల్లా, ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర శివారు నాల్గో టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని పాంగ్ర గ్రామానికి చెందిన చంద్రకళ అనే ఒంటరి మహిళను హత్య చేసి ఆమె వద్ద నుంచి బంగారు కమ్మలు, వెండి పట్టగొలుసులు అపహరించిన వ్యక్తిని నాల్గో టౌన్ పోలీసులు పట్టుకున్నట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు. వివరాలను శుక్రవారం కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో విలేకరులకు వెల్లడించారు. తన తల్లి చంద్రకళను గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేశారని మార్చి 28న మృతురాలి కూతురు మౌనిక నాల్గోటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు ఎస్సై శ్రీకాంత్ నగర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రాజు నత్వంలో కేసు దర్యాప్తు చేపట్టారని తెలిపారు. ఆ ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారన్నారు. ఈ క్రమంలో ఈనెల 3న సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేయగా తాను నేరం అంగీకరించినట్లు చెప్పారు. శంషాబాద్ విజయ్ అనే వ్యక్తి జులాయిగా తిరిగుతూ ఒంటరిగా ఉండే చంద్రకళను పరిచయం చేసుకుని ఆమెకు కల్లు తాగిస్తూండే వాడన్నారు. ఆమెపై ఉన్న బంగారు ఆభరణాలు చెవి కమ్మలు, ఆమె సెల్‌ఫోన్, వెండి పట్టగొలుసులు తీసుకుని తన వద్ద ఉన్న కత్తితో ఇమె గొంతు కోసి హత్య చేసి పాంగ్ర వద్ద ఉన్న ద్విచక్రవాహనం దొంగిలించి పారిపోయినట్లు తెలిపారు. తాను వేసుకున్న షర్ట్‌కు రక్తపు మరకలు అంటడంతో దానిని, బెడ్‌షీట్‌ను కాల్చి వేసినట్లు తెలిపారు. సాక్ష్యం లేకుండా ఉండేందుకు ఆమె సెల్‌ఫోన్‌ను చీకటిలో పారేసి వెళ్లినట్లు చెప్పారు. నేరం అంగీకరించడం వల్ల ఆయనపై కేసున మోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు. ఈ కేసును ఛేదించిన నగర ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రాజు, నాల్గోటౌన్ ఎస్సై శ్రీకాంత్, సిబ్బందిని సీపీ అభినందించారు.

రోడ్ల అభివృద్ధి కోసం నిధుల విడుదల

నిజామాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో ఎస్సీ కాలనీలో రోడ్ల నిర్మాణం కోసం నిధులు విడుదల అయ్యాయి. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద ప్రతి నియోజకవర్గానికి రూ.10కోట్ల నిధులను విడుదల చేశారు. ఈ నిధుల ద్వారా ఆయా నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో ఎస్సీ కాలనీలో రోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు మొత్తం 50 కోట్ల నిధులను సీఆర్ఆర్ కింద విడుదల చేశారు. ఈ నిధుల ద్వారా ముందు ఆయా గ్రామాల్లో పరిశీలించి ప్రజా ప్రతినిధుల సిఫారసులకు అనుగుణంగా ఈ పనులను చేపడుతారు. పనులను బిట్‌లుగా చేసి టెండర్ల ద్వారా రోడ్ల నిర్మాణం చేపట్టేందుకు అనుమతులను ఇస్తున్నారు. గ్రామాల్లోని ఎస్సీ కాలనీలో మౌలిక వసతులను సమకూర్చేందుకు ఈ నిధులను విడుదల చేస్తున్నట్లు ఈఈ శంకర్ రాథోడ్ తెలిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద ఈ నిధులు విడుదల అయ్యాయని ఆయన తెలిపారు.

నిర్ణీత సమయంలో కార్యక్రమాలను నిర్వహించుకోవాలి

ఖిల్లా, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): నిర్ణీత సమయంలో కార్యక్రమాలను నిర్వహించుకోవాలని అందరిని సమన్వయపరుస్తూ ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని నిజామాబాద్ ఏసీపీ ఎల్.రాజావెంకటరెడ్డి అన్నారు. శ్రీరామనవమి పండుగ సందర్భాన్ని పురస్కరించుకొని కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో సీపీ సాయిచైతన్య ఆదేశాల మేరకు శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఒకరి మనోభావాలను దెబ్బతీయకుండా గౌరవించుకుంటూ సామాన్య ప్రజలకు ఇబ్బంది కలుగకుండా పండుగలను నిర్వహించుకోవాలన్నారు. శ్రీరాముని కల్యాణం, ర్యాలీ సందర్భంగా నిబంధనలు పాటించాలని వివరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ పటిష్ఠమైన బందోబస్తు, నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. శ్రీరామనవమి నిర్వాహకులు సమన్వయం పాటించాలని ఎటువంటి వదంతులకు చోటు కల్పించరాదని కోరారు.

ధాన్యం సేకరణ వివరాలను పక్కాగా నమోదు చేయాలి

● రైతులకు తప్పనిసరిగా రసీదులు అందించాలి ● కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

రెంజల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాలల్లో ధాన్యం సేకరణకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. రైతుల నుంచి ధాన్యం సేకరించిన వెంటనే వారికి తప్పనిసరిగా రసీదులు అందించాలని అన్నారు. మండలంలోని దూపల్లి, దండిగుట్ట, రెంజల్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ శుక్రవారం పరిశీలించారు. దూపల్లి, దండిగుట్ట కొనుగోలు కేంద్రాల్లో రిజిస్టర్లలో వివరాలు సరిగా నమోదు చేయకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ట్రక్ షీట్లు వచ్చిన వెంటనే ట్యాబ్ ఎంట్రీలు చేయాలని తద్వారా రైతులకు సకాలంలో బిల్లుల చెల్లింపులు జరుగుతాయని అన్నారు. ప్రతి కేంద్రంలో సరిపడా గన్నీ బ్యాగులు, గ్రెయిన్ క్యాలీపర్లు మాయిశ్చర్ మీటర్లు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సీజన్‌లోనే తొలిసారి కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్న ఐకేపీ మహిళా సంఘాలకు ధాన్యం సేకరణ ప్రక్రియలో సహకారం అందించాలని సొసైటీ సీఈవోలకు సూచించారు. ధాన్యం లోడింగ్, అన్ లోడింగ్ త్వరగా జరగాలని, హమాలీల కొరత, లారీల కొరత తలెత్తకుండా ప్రణాళిబద్ధంగా పని చేయాలన్నారు. ధాన్యం తూకంలో తేడాలు లేకుండా పారదర్శకత పాటించాలని సూచించారు. రబీ సీజన్ ధాన్యం సేకరణ కోసం ఈసారి జిల్లాలో 700పై


రెంజల్‌లో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్

చిలుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఇప్పటికే 100వరకు కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయని కలెక్టర్ ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో సాయాగౌడ్, డీఎస్‌వో అరవింద్ రెడ్డి, డీసీవో శ్రీనివాస్, డీపీఎం సాయిలు, తహసీల్దార్ శ్రావణ్ కుమార్, ఐకేపీ డీపీఎం సాయిలు, ఐకేపీ ఏపీఎం చిన్నయ్య, ఏపీఎం చిన్నయ్య, ఆర్ఐ రవి కుమార్, దూపల్లి సొసైటీ చైర్మన్ భూంరెడ్డి, రెంజల్ సొసైటీ చైర్మన్ మైనోద్దీన్, సీఈవో ఇంద్రసేన్ పాల్గొన్నారు.

అటవీ ప్రాంతంలో తుపాకుల శబ్దం

మోపాల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని సిర్పూర్, మల్కాపూర్ తండా దట్టమైన అటవీ ప్రాంతంలో శుక్రవారం ఉదయం తుపాకుల శబ్ధం మారుమోగడంతో ఆ ప్రాంత ప్రజలు భయబ్రాంతులకు గురయ్యారు. ఒకప్పుడు పీపుల్స్‌వార్‌కు కంచుకోటగా ఈ దట్టమైన అటవీ ప్రాంతం ఉండేది. మళ్లీ ఇప్పుడు తుపాకుల శబ్దం వినబడటంతో ఏం జరుగుతుందోనని ఈ ప్రాంత వాసులు ఆందోళన చెందారు. కొత్తగా ఎన్నికైన పోలీస్ గ్రానైన్స్ దళారులు ఈ ప్రాంతంలో వారికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిసింది. శుక్రవారం ఉదయం సిర్పూర్, మల్కాపూర్ తండా అటవీ ప్రాంతాలకు పెద్ద ఎత్తున పోలీసు బలగాలు వాహనాల్లో వచ్చారు. కొత్తగా నియమితులైన పోలీసులకు ఈ ప్రాంతంలో శిక్షణ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. పోలీసు బలగాలు ఈ అటవీ ప్రాంతంలో దిగి కాలినడకన అటవీ ప్రాంతంలోకి వెళ్లినది చూసిన గ్రామీణ ప్రజలు ఆశ్చర్యపోయారు. మళ్లీ ఈ అటవీ ప్రాంతంలో ఏం జరిగిందోనని పలు గ్రామాల ప్రజలు ఆశ్చర్యపోయారు. సుమారు గంటన్నర, రెండు గంటల పాటు తుపాకుల శబ్ధం మోగింది. ఉన్నతాధికారులు కొత్తగా నియమితులైన పోలీసులకు ఈ ప్రాంతంలో శిక్షణ ఇచ్చినట్లు తెలియడంతో ఆయా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

బాధిత రైతులకు రూ.30వేలు ఇవ్వాలి

● బీజేపీ కిసాన్‌మోర్చ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి

ధర్పల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వడగండ్ల వాన, అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేలు ఇవ్వాలని బీజేపీ కిసాన్ మోర్చ రాష్ట్రనాయకులు శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోగల వరి కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తడిసిన ధాన్యంపై రైతులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఇంతవరకు తూకం వేయకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వరి కుప్పలు అకాల వర్షాలతో తడిసి ముద్దయిన కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం పై ఆయన డీసీవోతో ఫోన్‌లో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో వెంటనే తూకం ప్రారంభించాలని సూచించారు. తేమశాతం ఉన్న ధాన్యాన్ని వెంటనే తూకం జరిగే విధంగా చూడాలని ఆయన సూచించారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రంలో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్‌ను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు మహిపాల్ యాదవ్, రైతులు ఉన్నారు.

ఐపీఎల్‌కు ఆదరణ పెరుగుతోంది

● బీసీసీఐ ప్రతినిధి గాజుల మోహన్


మాట్లాడుతున్న బీసీసీఐ ప్రతినిధి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం జరుగు తున్న టాటా ఐపీఎల్ గతం లోకంటే పెద్దదిగా వినియోగాత్మకంగా ఉత్తేజకరంగా మారిందని రోజురోజుకి క్రికెట్ క్రీడ చూసే ప్రేక్షకులు పెరుగుతున్నారని బీసీసీఐ ప్రతినిధి గాజుల మోహన్, నిజామాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి వెంకట్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో వారు మాట్లాడారు. ఇందూరు క్రికెట్ ప్రేమికుల కోసం నగరంలోని ఉమెన్స్ కాలేజీ గ్రౌండ్‌లో శని, ఆదివారాలు ఫ్యాన్స్ పార్క్ ఏర్పాటు చేస్తున్నామని క్రీడాప్రేమికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈలలు, చీర్స్ అంతా అభిమానులగురించేనని అన్నారు.

కత్తితో దాడి చేసిన ఇద్దరి అరెస్ట్

ఖిల్లా,ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి):తన మనవరాలుతో అసభ్యంగా ప్రవర్తిస్తున్న వ్యక్తిని ప్రశ్నించినందుకు ఆ కుటుంబంపై కత్తితో దాడి చేసిన ఇద్దరిని ఆరోటౌన్ ఎస్సై వెంకట్రావ్, సిబ్బంది సహాయంతో అదుపులోకి తీసుకున్నట్లు సౌత్‌రూరల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు. ఆరోటౌన్‌లో శుక్రవారం వివరాలను విలేకరులకు వెల్లడించారు. ఆరోటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలోని అక్బర్‌కాలనీ(కెనాల్‌కట్ట)కి చెందిన పాషా అతని కుటుంబం నివాసం ఉంటున్నారన్నారు. వారి ఇంటి పక్కనే నివాసం ఉండే సోహెల్‌ఖాన్ అనే వ్యక్తి పాషా మనుమరాలితో తరుచు అసభ్యంగా ప్రవర్తించే వాడు. ఈ విషయమై పాష కుటుంబం సోహెల్‌ఖాన్‌ను ప్రశ్నించగా సోహెల్‌ఖాన్ గొడవను మనసులో పెట్టుకుని గురువారం సాయంత్రం పాష ఇంటిపై దాడి చేశాడు. ఇరు కుటుంబ సభ్యులు పరస్పరంగా దాడులు చేసుకోగా షేక్ గౌస్, సయ్యద్ ఫయాజ్‌లకు గాయాలు అయ్యాయి. సయ్యద్‌పాష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని ఆరీఫ్‌ఖాన్, సోహెల్‌ఖాన్, ఫేక్‌పర్వేజ్‌లను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్స్‌పెక్టర్ సురేష్ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఆరవటౌన్ ఎసై వెంకట్రావ్, సిబ్బంది పాల్గొన్నారు.

రెండేళ్లలో రూరల్ రైతాంగానికి గోదావరి నీళ్లు

● నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

సిరికొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : రానున్న రెండేళ్లలో నిజామాబాద్ రూరల్ రైతాంగానికి ప్రాణహిత-చేవేళ్ల 21వ ప్యాకేజీ ద్వారా గోదావరి నీళ్లను అందిస్తామని నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి వెల్లడించారు. సిరికొండ మండలంలోని పలు గ్రామాల్లో పదకొండున్నర కోట్ల నిధులతో చేపట్టిన, చేపట్టబోతున్న వివిధ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. రామడుగు గ్రామంలో జరిగిన సభలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో రీడిజైన్ పేరుతో ప్రాణహిత చేవేళ్ల పథకంలోని 21వ ప్యాకేజీలో గ్రావిటి ద్వారా కాకుండా పైపుల ద్వారా సాగునీళ్లను అందిస్తామని చెప్పి సుమారు తొమ్మిది వందల కోట్లు వెచ్చించి రైతులకు నీళ్లందించకుండా మొండి చేయి చూపించారని విమర్శించారు. తాము రైతులకు ఈ సారి


రామడుగులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఖచ్చితంగా 21వ ప్యాకేజీ ద్వారా నిజామాబాద్ రూరల్ రైతాంగానికి సాగునీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రవి, నిజామాబాద్ మార్కెట్‌కమిటీ అధ్యక్షులు ముప్పా గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్ తదితరులు మాట్లాడగా తహసీల్దార్ రవీందర్రావు, ఎంపీడీవో మనోహర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ డీఈ ప్రేమ్‌కుమార్, ఆర్‌అండ్‌బీ డీఈ గులాబ్‌సింగ్, పంచాయతీరాజ్ డీఈ ఆహ్మద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

మూడు రోజుల క్రితం అకాల వర్షం కురిసి పంటలు నష్టపోయినరైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి భరోసా ఇచ్చారు. సిరికొండ మండలం ముషీర్‌నగర్‌లో గురువారం కురిసిన అకాలవర్షానికి తడిసి పోయిన దాన్యాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ దాన్యం తడిసిపోయిందని అధైర్య పడవద్దని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభు త్వమని మీకోసం పనిచేస్తుందన్నారు. రైతు లను అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. మెట్టుమర్రితండాలో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. గడ్కోల్‌లో రూ.12 లక్షలతో నిర్మించే అంగన్‌వాడీ భవనానికి శంకుస్థాపన చేశారు. కొండాపూర్ నుంచి కార్నల్ తండా వరకు రెండు కోట్ల46 లక్షలతో నిర్మించే డబుల్ రోడ్డు కు ఎమ్మెల్యే శంకు ప స్థాపన చేశారు. రెండు కోట్లతో నిర్మించిన తారు రోడ్డును ఎమ్మెల్యే భూపతిరెడ్డి ప్రారంభించారు.

నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు చేసిన వారికి జైలు

ఖిల్లా,ఏప్రిల్ 4(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు చేసే వారిని గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్లు ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో టి.రఘుపతి తెలిపారు. గురువారం అర్ధరాత్రి నిబంధలు పాటించకుండా వ్యాపార సముదాయాలు తెరచి ఉంచిన సయ్యద్ తాజముల్ (గుల్జార్‌పాన్‌షాప్), నాదీముల్లాఖాన్ (ఓల్డ్ ప్యారడైస్ హోటల్),షేక్ షాబోద్దీన్ (హోటల్ ఎక్సలెంట్)లను శుక్రవారం సెకండ్‌క్లాస్ జడ్జి ఎదుట హాజరు పర్చగా రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మేనేజ్‌మెంట్ విభాగంలో రామ్‌ప్రసాద్‌కు డాక్టరేట్ ప్రధానం

డిచ్‌పల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ విభాగంలో రామ్‌ప్రసాద్ కు అసోసియేట్ ప్రొఫెసర్ రాజేశ్వరి పర్యవేక్షణలో డాక్టరేట్ పట్టా ప్రధానం చేశారు. ఐటీ ఇండస్ట్రీ సెలక్స్ స్టడీ అనే అంశంపై రామ్‌ప్రసాద్ పరిశోధన జరిపారు. వైవా కు ఎక్స్‌టర్నల్ గా బెంగళూర్ సిటీ యూనివర్సిటీ ప్రొఫెసర్ నారాయణప్ప హాజరై పరిశోధన గ్రంథం పలు ప్రశ్నలు అడిగి సమాధానలు రాబట్టారు. పరిశోధకుడు సరైన సమాధానలు ఇచ్చారు. ఈ పరిశోధనలో ప్రధానంగా ఐటీ లో టాలెంట్ ఐక్వేషన్, ప్రాక్టీస్ డెలప్‌మెంట్ అంశాలపై సిద్ధాంతం గ్రంథం అందించడం పట్ల సంతోషం వ్యక్తం చేసి పీహెచ్‌డీ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డా.అంజనేయులు, డీన్ అపర్ణ, డా.వాణి, కిరణ్ రాథోడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్‌లో జిల్లాకు చోటు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బాలలహక్కుల పరిరక్షణ కోసం నూతనంగా కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు జీవో నెంబర్ 45 విడుదల చేసింది. మొత్తం ఏడుగురు సభ్యులను నియమించారు. ఈ కమిషన్‌లో జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు ప్రేమలత అగర్వాల్‌కు చోటు దక్కింది. చైర్మన్‌గా కొత్తకోట సీతాదయాకర్ రెడ్డి, మిగతా సభ్యులు కంచర్ల వందన గౌడ్, మరిపల్లి చందన, బి.అపర్ణ, గోగుల సరిత, ప్రేమలత అగర్వాల్, బి.వచ్చన్ కుమార్‌లను ఎంపిక చేశారు. నియామకం పట్ల మహిళా కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రేమలత అగర్వాల్ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకురాలిగా ఉన్నారు.


నియామకమైన ప్రేమలత అగర్వాల్


హైదరాబాద్‌లో విశ్వవిద్యాలయాల వైస్‌చాన్స్‌లర్లతో శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న తెలంగాణ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ యాదగిరిరావు - డిచ్‌పల్లి, ఆంధ్రజ్యోతి

సంతోషి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన


శిఖర ప్రతిష్ఠ చేస్తున్న స్వామీజీ

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని నాందేవ్‌వాడలో గల సాయిసంతోషి ఆలయ పునః నిర్మాణ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం గంగోత్రి రామానుజదాసు స్వామి వేదపండితుల వేదమంత్రోచ్చరణలతో యంత్ర, విగ్రహ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవం జరి పారు. వేలేటి పశుపతిశర్మ, రామశర్మ, మందమర్రి శ్రీధరాచార్య, గోవర్ధ నం కృష్ణమాచార్య, కలకుంట్ల శ్రీధరాచార్య వేదమంత్రాలు పఠించగా గంగోత్రి రామానుజదాసు స్వామి, అర్చకులు శ్రీభాష్యం కృష్ణమాచార్య ప్రతిష్ఠించి దేవతా మూర్తులకు పంచామృత అభిషేకాలు చేశారు. ఆలయం చుట్టూ దేవతా మూర్తులకు బలి, క్షేత్ర బలి పూజలు చేసి పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన అన్నప్రసాదంలో భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి శ్రీరాం రవీందర్‌గుప్త, జూనియర్ అసిస్టెంట్ ఆంజనేయులు, ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక కుంకుమార్చనలు

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):రూరల్ మండలం పరిధిలోని అతి పురాతనమైన గుండారం సీతారామచంద్రస్వామి దేవాలయంలో శుక్రవారం భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. వేదపండితులు కందాళై నరేంద్రమూర్తి, వేణుగోపాలశర్మ, ఫణికృష్ణచార్య వేదమంత్రాలు పఠించగా మహిళలు అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఆలయం చుట్టూ సీతారామచంద్ర, లక్ష్మణ సమేత ఉత్సవ విగ్రహాలను బాజా భజంత్రీలతో స్వామివారి నామస్మరణలతో ప్రదక్షిణ గావించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భజన మండలి ఆధ్వర్యంలో భక్తులు భజనలు భక్తిపాటలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో చక్రవర్తుల శ్రీవస్త కోదండపాణి, విఠల్‌శర్మ, నాగభూషణం, ఆలయ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సుద్దపల్లిలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల పరిసరాల పరిశుభ్రత

డిచ్‌పల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుద్దపల్లిలో తెలంగాణ వర్సిటీ ఎన్ఎస్ఎస్ యూనిట్ 1,4 శుక్రవారం వేసవి కాలం దృష్ట్యా స్వచ్ఛభారత్‌ను గ్రామంలో నిర్వహించారు. డా.స్రవంతి, డా.స్వప్న ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హనుమాన్ మందిరం వద్ద పరిసరాలను పరిశుభ్రం చేశారు. పరిశుభ్రతపై ప్రజలకు అవగహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్లు స్రవంతి, స్వప్నలు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు పర్యావరణ రక్షితకు తోడ్పాడలని అన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

7 నుంచి ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ

డిచ్‌పల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా ఈ నెల 7న టైలరింగ్ శిక్షణ ఉచితంగా ఇవ్వనున్నామని, ఆసక్తి గల యువతులు శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి, నిజామాబాద్ యువత ఈ ఆవకాశం సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఆసక్తి గల వారు ఆధార్, రేషన్, మెమో, 5 ఫొటోలతో కేంద్రంలో ధరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 08461-295428 నంబర్‌కు సంప్రదించాలని ఏప్రిల్ 14 నుంచి బ్యూటీ పార్లర్ శిక్షణ ఇదే ఆఫీస్‌లో ఉంటుందని శిక్షణ సమయంలో హస్టల్ వసతి, భోజన సదుపాయం ఉంటుందన్నారు.

దళారులకు ధాన్యం విక్రయించవద్దు

డిచ్‌పల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన వరి ధాన్యంను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించుకొని మద్దతు ధర పొందాలని తహసీల్దార్ ప్రభాకర్, వ్యవసాయాధికారి సుధామాధురిలు అన్నారు. శుక్రవారం బర్ధిపూర్ సొసైటీ పరిధిలో గల ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతువేదిక వద్ద చైర్మన్ రామకృష్ణలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రభాకర్ మాట్లాడుతూ.. రైతులు దళారులకు ధాన్యం విక్రయించి నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, జయరామయ్యనారాయణ రెడ్డి, ఏఈవో ఆశ్రిత పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న వ్యవసాయాధికారి

చికెన్ ధరలు




రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.270	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.160	రూ.280	రూ. 310

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.93,000	రూ.85,500	రూ.1020

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్ర్కీన్-1 : డర్ (హిందీ) (10.40, 4.35)
: ఏ మైన్ క్రాఫ్ట్ (3డీ ఇంగ్లీష్) (2.15, 8.10, 10.30)
స్ర్కీన్-2 :ఏ మైన్ క్రాఫ్ట్ (3డీ ఇంగ్లీష్) (10.55)
: రాబిన్‌హుడ్ (1.15)
: మ్యాడ్ స్క్వేర్ (4.25, 10.10)
: సికిందర్ (హిందీ) (7.10)
స్ర్కీన్-3 : సికిందర్ (హిందీ) (10.30, 1.30, 4.30, 10.35)
: ఎల్‌వైఎఫ్ (7.30) స్ర్కీన్-4: వృషభ (11.00)
: శారీ (2.00) : 28సి (4.50)
: రాబిన్‌హుడ్ (7.15) : ఆదిత్య 369 (10.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : ఆదిత్య 369 (11.00, 4.20)
: మ్యాడ్ స్క్వేర్ (1.30, 7.30, 10.30)
స్ర్కీన్-2 : ఆర్య-2 (11.00, 4.30, 10.20)
: రాబిన్‌హుడ్ (1.40, 7.30)
స్ర్కీన్-3 : ఆర్య-2 (1.30)
: సికిందర్ (హిందీ) (4.30, 7.30, 10.20)

లలితామహల్ : కోర్టు (11.15, 2.15, 6.15, 9.15)
దేవి : ఆర్య-2 (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : సికిందర్ (హిందీ) (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : మ్యాడ్ స్క్వేర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్